క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేస్తున్న దృశ్యం

గోరంట్ల: మండలపరిధిలోని కరావులపల్లిలో గ్రామస్తులు, దాతల సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న కరావులీశ్వర దేవాలయ నిర్మాణానికి బెంగళూరులో స్థిరపడిన కరావులపల్లికి చెందిన మైలారం లింగప్ప కుమారుడు మైలారం కిష్టప్ప సోమవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. విరాళం మొత్తాన్ని ఆయన సోదరి లక్ష్మీదేవమ్మ ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గంపల వెంకటరమణారెడ్డి, రేపటి రామచంద్రారెడ్డి, గొల్ల శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హిందూపురం టౌన్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, వసతిదీవెన బకాయిలు విడుదల చేయాలని, పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77ను రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం నిరసన ర్యాలీ చేశారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం చేరుకుని ఆందోళన చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరసింహమూర్తి, శేషం మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మడకశిర: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి చొరవ తీసుకోవాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోనంకి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఎస్టీయూ ప్రాంతీయ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ బదిలీ ప్రమోషన్ పొందిన ఉపాధ్యాయులకు పొజిషన్ బదిలీలు కేటాయించి జీతాలు పొందేలా చూడాలన్నారు. 12వ పీఆర్సీ అమలుతో పాటు 30 శాతం ఐఆర్, పెండింగ్‌లో ఉన్న డీఏలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఆదినారాయణ, ఎస్టీయూ నాయకులు తిప్పేస్వామి, నవీన్, సత్యనారాయణరెడ్డి, మాలతీ పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి సలహాలివ్వండి

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి తగిన సూచనలు సలహాలు అందించాలని కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. ఈ నెల 10న కళాశాలలో పేరెంట్స్ సమావేశం జరగనున్న నేపథ్యంలో పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, దాతలు, విద్యార్థుల తల్లిదండ్రులను ప్రిన్సిపాల్‌తో పాటు కళాశాల అధ్యాపకులు సోమవారం ఆహ్వాన పత్రికలు అందజేశారు.

ఘనంగా ఏకలవ్యుడి జయంతి

హిందూపురం: పట్టణంలోని యల్లమాంబ గుడి వద్ద ఏపీ ఎరుకల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు శంకరయ్య ఆధ్వర్యంలో ఏకలవ్యుడి జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. ఎంఈఓ గంగప్ప మాట్లాడుతూ ఏకలవ్యుని ఏకగ్రత, గురుభక్తి ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు.

మడకశిర అభివృద్ధిలో.. వైఎస్సార్ చెరగని ముద్ర

- 1,600 ఎకరాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటు
- మడకశిరను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చిన వైనం
- కుంచిటి వక్కలిగల దశాబ్దాల కల నెరవేర్చిన మహానేత
- హంద్రీనీవా సాగునీటి పథకానికి జీవం
- ఫ్లోరైడ్ రహిత తాగునీరు అందించడానికి శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ఏర్పాటు



మడకశిరలో ఏర్పాటు చేసిన వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల



మడకశిరలో ఏర్పాటు చేసిన వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల

మడకశిర: మహానేత వైఎస్సార్ హయాంలో మడకశిర నియోజకవర్గ రూపురేఖలు మారిపోయాయి. ప్రధానంగా 2004లో రెండో విడత పల్లె బాట కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ అమరాపురం నుంచి మడకశిర వరకూ పర్యటించారు. అప్పుడు మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా..

మడకశిరను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చిన ఘనత వైఎస్సార్‌దే. మడకశిర కేంద్రంగా 150 ఎకరాల్లో వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేశారు. అలాగే వ్యవసాయ, వెటర్నరీ, హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలలను నెలకొల్పారు. అలాగే మడకశిరలో ఒకేషనల్ జూనియర్ కళాశాల, జనరల్ పాలిటెక్నిక్ కళాశాల, అమరాపురం, గుడిబండలో జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి తోడాటునందించారు. రూ.కోట్లు వెచ్చించి ఈ విద్యా సంస్థలకు భవనాలను కూడా నిర్మించారు.

తీరిన సాగునీటి కష్టాలు

వైఎస్సార్ ముఖ్యమంత్రి కాక ముందు మడకశిర నియోజకవర్గంలో ఎలాంటి సాగునీటి పథకాలు లేవు. ఈ విషయాన్ని గుర్తించిన వైఎస్సార్.. ముఖ్యమంత్రి కాగానే హంద్రీనీవా సాగునీటి పథకాన్ని మంజూరు చేశారు. తన హయాంలోనే రూ.కోట్లు వెచ్చించి నియోజకవర్గంలో 90 శాతం హంద్రీనీవా సాగునీటి పథకం పనులను పూర్తి చేశారు. ఆరోజు హంద్రీనీవా కాలువ పనులను పూర్తి చేయడంతో మడకశిర నియోజకవర్గంలోని చెరువులకు వైఎస్ జగన్ హయాంలో కృష్ణా జలాలు రావడానికి అవకాశం ఏర్పడింది.

రక్షిత మంచినీరు సైతం..

నియోజకవర్గంలోని ప్రజలు ఫ్లోరైడ్ తాగునీటిని ఉపయోగిస్తుండడంతో రోగాల పాలయ్యేవారు. ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్సార్ పీఏబీఆర్ (శ్రీరామరెడ్డి) తాగునీటి పథకాన్ని మంజూరు చేశారు. దాదాపు రూ.550 కోట్లు వెచ్చించి ఈపథకాన్ని పూర్తి చేశారు. దీని ద్వారానే దాదాపు 200 గ్రామాలకు నేటికీ ఫ్లోరైడ్ రహిత తాగునీరు సరఫరా అవుతున్నాయి.

> దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తన హయాంలో పూర్తిగా వెనుకబడిన మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేశారు. 2004 నుంచి 2009 వరకూ వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నన్నాళ్లు మడకశిర నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించింది. నేటికీ నియోజకవర్గ ప్రజలు వైఎస్సార్ సేవలను గుర్తుచేసుకుంటూనే ఉన్నారు.


1,600 ఎకరాల్లో పారిశ్రామికవాడ ఏర్పాటు: మడకశిర నియోజకవర్గంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి వీలుగా వైఎస్సార్ తన హయాంలో పారిశ్రామికవాడ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే మడకశిర పట్టణ సమీపంలో 1,600 ఎకరాల భూములను పారిశ్రామిక వాడ ఏర్పాటుకు సేకరించారు. ఈరోజు వేల ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామిక వాడ ఉండడంతో పరిశ్రమల ఏర్పాటుకు సులభంగా మారింది.

నెరవేరిన కుంచిటి వక్కలిగల కల

వైఎస్సార్ ముఖ్యమంత్రిగా నియోజకవర్గంలోని కుంచిటి వక్కలిగ దశాబ్దాల కలను నెరవేర్చారు. 2008లో నియోజకవర్గంలోని కుంచిటి వక్కలిగలను బీసీ–బీ గుర్తిస్తూ వైఎస్సార్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పరుగులు తీసిన అభివృద్ధి

మడకశిరలో ప్రధానంగా రోడ్లు, చెరువులను పెద్ద ఎత్తున అభివృద్ధి చేశారు. పేదలకు వేలాది ఇళ్లను నిర్మించి వారి గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా విరివిగా విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మించిన ఘనత కూడా వైఎస్సార్‌దే. ఐదేళ్ల తన పాలనలో వైఎస్సార్ మడకశిర నియోజకవర్గంలో దాదాపు రూ.3 వేల కోట్ల అభివృద్ధి పనులను చేపట్టడం విశేషం.



వైఎస్సార్‌కు రుణపడి ఉంటాం



నియోజకవర్గంలోని కుంచిటి వక్కలిగలందరూ వైఎస్సార్‌కు రుణపడి ఉంటాం.కొన్ని దశాబ్దాలుగా బీసీలుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ వచ్చాం. అయితే ఏ ముఖ్యమంత్రి మా గోడు పట్టించుకోలేదు. వైఎస్సార్ హయాంలో బీసీ–బీగా గుర్తించి ఉత్తర్వులు జారీ చేయడం గొప్ప విషయం. ఆయన చేసిన మేలు కుంచిటి వక్కలిగలు ఎప్పటికీ మర్చిపోరు.

– అనంతరాజు, కుంచిటి వక్కలిగ సంఘం అధ్యక్షుడు, మడకశిర

మడకశిర అభివృద్ధికి ఎంతో కృషి



వైఎస్సార్ హయాంలో 2006లో నేను సర్పంచుగా ఉన్నా. ఆయన ముఖ్యమంత్రిగా ఇచ్చిన హామీలన్నీ వంద శాతం నెరవేర్చి మడకశిరను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారు. హంద్రీనీవా సాగునీటి పథకాన్ని ప్రారంభించి రైతులకు అండగా నిలిచారు. మడకశిరను విద్యా కేంద్రంగా మార్చారు. పరిశ్రమల ఏర్పాటుకు వేల ఎకరాల భూములు సేకరించి నిరుద్యోగులకు మేలు చేశారు.

– ఈరలక్కప్ప,వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త,మడకశిర:

భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం



మడకశిర: అలంకరణలో ఆంజనేయస్వామి



రొద్దం: జ్యోతులు మోస్తున్న మహిళలు

రొద్దం: రొద్దం మండల పరిధిలోని ఆర్ కుర్లపల్లి గ్రామ సమీపంలో వెలసిన ముక్కాంజనేయస్వామికి సోమవారం భక్తులు జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు జ్యోత్యులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయి ఎస్సీ కాలనీవాసులు తిమ్మప్పస్వామి, రంగనాథ స్వామి వార్లకు మహిళలు జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. అలాగే బుళ్లసముద్రంలో సమీపంలోని అంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సందడిగా ఉట్ల పరుష



పరిగి: భక్తుల పాలిట కొంగు బంగారంగా వెలుగొందుతున్న బాలిరెడ్డిపల్లి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఉట్లమాను పరుష సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల జనం పెద్ద ఎత్తున తరలిరావడంతో సందడి నెలకొంది.

సబ్ జూనియర్స్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ సబ్ జూనియర్ బాల, బాలికల జట్లు

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానంలో శ్రీ సత్యసాయి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ సబ్ జూనియర్స్ బాల, బాలికల జట్లు సోమవారం ఎంపిక చేశారు. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరు కాగా, వారి ప్రతిభ ఆధారంగా జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు జోనల్ వారీగా జరిగే పోటీల్లో పాల్గొని, అక్కడ ప్రతిభ కనబరిచిన వారు రాష్ట్ర స్థాయి ఇంటర్ జోనల్ పోటీల్లో పాల్గొననున్నారు.

నేడు వైఎస్సార్ జయంతి

చిలమత్తూరు: నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ డాక్టర్ వైఎస్సార్ జయంతి వేడుకలు మంగళవారం జరుగుతాయని పార్టీ సమన్వయకర్త టీఎన్ దీపిక తెలిపారు. ఉదయం 9 గంటలకు నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లోనూ జయంతి వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరుగుతుందన్నారు.

మడకశిర: నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్సార్ జయంతి వేడుకలను వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేసినట్లు పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. మడకశిరలో వైఎస్సార్ విగ్రహం వద్ద ఉదయం 9 గంటలకు జయంతి వేడుకలు జరుగుతాయని తెలిపారు.

పెనుకొండ రూరల్: మహానేత వైఎస్సార్ జయంతి వేడులకను మంగళవారం ఉదయం 9 గంటలకు పట్టణంలోని మడకశిర రోడ్డులో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు నరసింహులు, సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

పరిగి: మండల కేంద్రంలో మంగళవారం మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో నిర్వహించే కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలన్నారు.

నేడు మడకశిరలో 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో'

మడకశిరరూరల్: పట్టణంలోని అమరాపురం రోడ్డులోని కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం మధ్యాహ్నం నియోజకవర్గ స్థాయి రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రకటన ద్వారా తెలిపింది.

రేపు చందకచెర్లులో..

మడకశిరరూరల్: మండల పరిధిలోని చందకచెర్లులో బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ రామిరెడ్డి, యువజన విభాగం అధ్యక్షులు శేషాద్రి తెలిపారు. ముఖ్య అతిథిగా నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప హాజరవుతారన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



అంబేడ్కర్ సర్కిల్‌లో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

హిందూపురం టౌన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో సోమవారం అర్ధనగ్నంగా మోకాళ్లపై కూర్చొని నిరసన తెలియజేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాబావలి, ఉమేష్ నాయక్ మాట్లాడారు. సత్యసాయి జిల్లాలో ఫుడ్ పాయిజన్ జరిగినా విద్యాశాఖ మంత్రి, అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 10న చలో విజయవాడ ధర్నా కార్యక్రమం ఉంటుందన్నారు.





సంక్షిప్త సమాచారం

శభాష్ .. శాంతమ్మ



సీడీపీఓకు స్థల పత్రం అందిస్తున్న శాంతమ్మ

పావగడ: అంగనవాడీ కేంద్రం భవన నిర్మాణానికి తన సొంత డబ్బుతో స్థలాన్ని కొని స్త్రీశిశు సంక్షేమశాఖ ఇచ్చారు అంగనవాడీ కార్యకర్త శాంతమ్మ. తాలూకాలోని కన్నేడి గ్రామ పంచాయతీ ఓబేనహళ్లిలో నూతన అంగనవాడీ భవన నిర్మాణానికి కావాల్సిన స్థలం ఇవ్వడానికి దాతలు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో అదే గ్రామంలోని అంగనవాడీ కేంద్రం కార్యకర్త శాంతమ్మ స్థలాన్ని కొని అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణానికి అందజేశారు.

సమస్యలను సత్వరం పరిష్కరించండి

అమరాపురం: గ్రామ సచివాలయాల్లో ప్రజలు ఇచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ లక్ష్మీ నరసింహ అధికారులకు సూచించారు. సోమవారం సాయంకాలం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో ఆయన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్వోలు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

లేపాక్షి: మండలంలోని పులమతి సచివాలయంలో పని చేస్తూ బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను సర్పంచ్ అశ్వత్థనారాయణ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకుడు నాగభూషణరెడ్డి, నాయకులు ప్రభాకర్‌రావు, కార్యదర్శి దుర్గయ్య పాల్గొన్నారు.

10న మండల సర్వసభ్య సమావేశం

రొద్దం: మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 10న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

హిందూపురం: కేంద్ర కార్మిక సంఘాల పిలుపు ఈనెల 9న దేశ వ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షుడు రవికుమార్, ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. తూమకుంట పారిశ్రామికవాడలోని పరిశ్రమల వద్ద కార్మికులకు సమ్మె కరపత్రాలను పంపిణీ చేశారు.

పాఠశాల పరిశీలన

సోమందేపల్లి: మండలంలోని పాపిరెడ్డిపల్లి సమీపంలో ఉన్న కస్తూర్బా పాఠశాలను ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ సోమవారం పరిశీలించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నీటి ట్యాంకు, వంట గదిని ఎంపీడీఓ పరిశీలించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మడకశిరరూరల్: మండల పరిధిలోని జీవీ పాళ్యం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చాంద్‌బాషా అన్న ఫకృద్దీన్ సోమవారం గుండె పోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, నాయకులు కృష్ణారెడ్డి, నరేష్‌రెడ్డి, తిప్పేస్వామి, శివ, పూల మూర్తి తదితరులు ఫకృద్దీన్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వ్యక్తికి గాయాలు

రొళ్ల: మండలంలోని ఆవినకుంట తండాకు చెందిన గోపాల్‌నాయక్ ఇంటి అవసరాల కోసం సోమవారం సంపు మోటర్ ద్వారా నీటిని తీసే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గాయాల పాలైన అతన్ని వెంటనే కుటుంబ సభ్యులు మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నరసింహస్వామి జాతర



అలంకరణలో నరసింహస్వామి

పావగడ: తొలి ఏకాదశి ని పురస్కరించుకుని తాలూకాలోని మీనకుంటనహళ్లిలోవెలసిన జోడు స్తంభాల నరసింహస్వామి జాతరోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఏడు గ్రామాల ఎద్దుల పరుషలో రైతులు గొర్రెలు, మేకలు, ఎడ్లబండ్లను ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేయించారు.

20న ముస్లిం లెజెండ్స్ పుస్తకావిష్కరణ

హిందూపురం: 'భారతీయ ముస్లిం లెజెండ్స్ – దేశ నిర్మాణంలో ముస్లిం దేశభక్తుల పాత్ర' పుస్తకావిష్కరణకు రావాలని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి గోపాల్‌గౌడ్‌ను ఆహ్వానించినట్లు పుస్తక రచయిత కల్లూరు ఉమర్‌ఫారుఖ్ ఖాన్ తెలిపారు.

ఉపాధ్యాయ జేఏసీ ఏర్పాటు

చిలమత్తూరు: మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు నూతన జేఏసీ ఏర్పాటు చేశారు. గౌరవాధ్యక్షుడిగా అలీముల్లా, అధ్యక్షుడిగా రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా సుందర్ రాజు, కోశాధికారిగా శ్రీనివాసులు, ఆడిటర్‌గా గోపాల్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా పద్మావతి, ఉపాధ్యక్షురాలిగా శశికళతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఎమ్మార్సీని పరిశీలించిన రాష్ట్ర కమిటీ సభ్యులు

రొళ్ల: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయాన్ని సోమవారం విద్యాశాఖ మానిటరింగ్ సభ్యులు సందర్శించారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాల సంఖ్య, విద్యార్థులకు విద్యా సామగ్రి కిట్లు, యూనిఫారాలు, ఉపాధ్యాయుల ఖాళీ స్థానాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర స్థాయి అధికారి మల్లికార్జున, ఎంఈఓ శ్రీధర్, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంట్లో అగ్ని ప్రమాదం

పావగడ: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దొమ్మతమరిలో బాబయ్య గుడి పక్కన ఉన్న ఓ ఇంట్లో సిలిండర్ పైప్ లీకేజ్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. కుటుంబ సభ్యులు బయటకు పరుగులు తీయడంతో ప్రాణాపాయం తప్పింది. ఇంట్లోని ఐదు బస్తాల బియ్యం, రెండు బస్తాల రాగులు, బీరువాలోని పత్రాలు వంట సామగ్రి కాలి బూడిదైనట్లు బాధితుడు ఇస్మాయిల్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఆర్థిక పరిహారం అందించాలని తహసీల్దార్‌ను వేడుకున్నాడు.

